నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 27 అక్టోబర్ 2024 | KHAMMAM

రక్తదానం ప్రాణదానంతో సమానం

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం

మామిళ్లగూడెం, అక్టోబర్ 26 : మీరొక్కరు ఇచ్చే రక్తం ఎక్కువ మంది ప్రాణాలను నిలబెడుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలివాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల(ఫ్లాగ్ డే) సందర్భంగా నగరంలోని సిటీ ఆర్మ్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీపీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు సెకన్లకు ఎవరికో ఒకరికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉంటుందని, అది సకాలంలో అందకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందురావాలని ఆయన కోరారు. అమర జవాన్లను స్మరిస్తూ ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. శిబిరంలో పోలీసులతోపాటు స్థానిక యువకులు 100 మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డీసీపీ ఏఆర్ కుమారస్వామి, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, మల్లయ్య, నర్సయ్య, సీఐలు రమేశ్, ఉదయ్ కుమార్, బాలకృష్ణ, మోహన్‌బాబు, ఆర్ఐలు సాంబశివరావు, కామరాజు, శ్రీశైలం, సురేశ్, డాక్టర్ జితేందర్, సంకల్ప తలసేమియా స్వచ్ఛంద సంస్థ, ఆటో యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సీపీ సునీల్ దత్

కేసీఆర్ పాలనలో ప్రతి పేదోడికి సాయం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ తాతా మధు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న తాతా మధు, జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, అక్టోబర్ 26 : బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సిఫారసు మేరకు మంజూరైన రూ.19,16,500 విలువచేసే 56 సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు 60శాతం పైనే మంజూరు చేశారని గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకోవాలనుకున్న ప్రతి పేదవాడికి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సహకారం అందుతుందని తెలిపారు. నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా మేలు జరిగేందుకు తాతా మధు చేస్తున్న కృషిని బీఆర్ఎస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో వైరా నియోజకవర్గ నాయకులు పోట్ల శ్రీను, డేరంగుల బ్రహ్మం, ముత్యాల వెంకట అప్పారావు, పోగుల శ్రీను, ఖమ్మంరూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు ఇంటూరి శేఖర్, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, ముదిగొండ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సద్దాం షేక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు సేవలు అందుతున్నాయి. మూడేళ్ల

ఇవీ అందించే సేవలు

లోపు పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు, పాలు పంపిణీ, ఆరేళ్లలోపు పిల్లలకు పప్పు, ఆకుకూరలతో భోజనం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణ చర్యలు తదితర కార్యక్రమాలు ప్రతిరోజూ జరుగుతుంటాయి. విద్యార్థులకు ఆట వస్తువులతో పూర్వ ప్రాథమిక విద్యను టీచర్లు అందిస్తారు. సిబ్బంది కొరత కారణంగా చాలా కేంద్రాల్లో ఈ సేవలన్నీ సక్రమంగా అందడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అరకొర సేవలే అందుతున్నాయి. ఆ శాఖలో ఖాళీలను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. టీచర్లకు చుట్టుపక్కల కేంద్రాల బాధ్యతలు సైతం అప్పగిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై 'అదనపు భారం' పడడంతో మానసికంగా వారు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లక్ష్యం నీరుగారిపోతున్నది. - అశ్వారావుపేట, అక్టోబర్ 26

అంగన్‌వాడీల్లో అరకొర సేవలు

- ఖాళీలను భర్తీ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఇన్‌చార్జి బాధ్యతలతో సరిపెడుతున్న వైనం
- 'అదనపు' భారంతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- భద్రాద్రి జిల్లాలో 191 టీచర్, 953 ఆయా పోస్టులు ఖాళీ
- నీరుగారుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లక్ష్యం

చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తున్నది. ఖాళీలను భర్తీ చేయకుండా సర్దుబాటు చర్యలతో సరిపెడుతుండడంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతున్నది. పక్క కేంద్రాల సిబ్బందిని సర్దుబాటు చేస్తుండడంతో రెండు కేంద్రాలకు న్యాయం చేయలేక పని ఒత్తిడితో నలిగిపోతున్నారు. కేంద్రాలు మూతపడకుండా నామమాత్రంగా విధులు ముగించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పనికి మించిన భారంగా మారింది. ఆయాలు లేనిచోట అంగన్‌వాడీ టీచర్లే పిల్లలకు భోజనం తయారు చేస్తున్నారు. టీచర్లు లేనిచోట పిల్లలు ఖాళీగా కూర్చొని ఆడుకుంటున్నారు.

ఆయా లేకపోవడంతో వంట చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

- మొత్తం ప్రాజెక్టులు 11
- అంగన్‌వాడీ కేంద్రాలు 2,060
- టీచర్ల ఖాళీలు 191
- ఆయాల ఖాళీలు 953

అదనపు భారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉండడంతో పనిచేస్తున్న సిబ్బందికి అదనపు పని భారం తప్పడంలేదు. ప్రతిరోజూ ఆయాలు ఇంటి నుంచి పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి వంట చేసి వడ్డించడం, తిరిగి పిల్లలను ఇండ్లకు పంపించడం చేస్తుంటారు. ఇక టీచర్ విద్యాబుద్ధులతో పాటు ప్రీ స్కూల్ సమయంలో ఆటలు నేర్పిస్తుంది. కానీ కొన్ని కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో వారి బాధ్యతలను టీచర్లే చేస్తున్నారు. దీంతో సమయంలేక పిల్లలకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నారు. ఇక టీచర్లు లేని కేంద్రాల్లో విద్యాబోధన అందడం లేదు.. ఆయాలు పిల్లలను చూసుకుంటూ వంట చేసి వడ్డించి ఇండ్లకు పంపిస్తున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు మోస్తున్న టీచర్లు వారంలో ఒకటీ రెండ్రోజులు ఆ కేంద్రాలకు వెళ్తున్నారు. కేంద్రాలు దూరం కావడంతో వచ్చి వెళ్లడానికే సమయం సరిపోతుందంటూ టీచర్లు చెబుతున్నారు. ఖాళీలను భర్తీ చేసి అదనపు బాధ్యతల నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు.

అదనపు పని భారంగా ఉంది

ఆయా లేకపోవడంతో అదనపు పనులు చేయడం చాలా భారంగా ఉంటోంది. ఇండ్లకు వెళ్లి పిల్లలను కేంద్రాలకు తీసుకురావడంతోపాటు వంట చేసి వడ్డించటం, పిల్లలను తిరిగి ఇండ్లకు పంపించే బాధ్యత టీచర్లపైనే పడుతున్నది. దీనివల్ల ప్రీ స్కూల్ నిర్వహించలేకపోతున్నాం. టీచర్లు లేని కేంద్రాలకు ఇన్‌చార్జి బాధ్యతలతో మరింత ఇబ్బందికరంగా ఉంది.

– బి.ద్వారకాబాయి, అంగన్‌వాడీ టీచర్, నారంవారిగూడెం

వేరే కేంద్రం నుంచి టీచర్ వస్తారు..

మా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ లేరు. పక్క ఊరు కేంద్రం నుంచి వారంలో ఒకటీ రెండ్రోజులు వచ్చి వెళ్తారు. పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి వంట చేసి భోజనం వడ్డిస్తున్నాను. సాయంత్రం తిరిగి ఇండ్లకు పంపిస్తాను. మిగతా రోజుల్లో పిల్లలకు విద్యాబోధన అందడం లేదు. ఖాళీలను భర్తీ చేస్తే బాగుంటుంది.

– నాగలక్ష్మి, ఆయా, నారంవారిగూడెం కాలనీ

అమరవీరుల త్యాగాలను మరువొద్దు

- శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసేది పోలీసులే..
- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ జితేశ్, ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 26 : దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను మరువొద్దని, వారి త్యాగాల చరిత్రను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవిపల్లి నుంచి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ మీదుగా రుద్రంపూర్ వరకు శనివారం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో కలెక్టర్ పాటిల్, ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ముఖ్యతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తుల నుంచి ప్రజలను కాపాడుతూ ఎంతో మంది జవాన్లు, పోలీసులు తమ ప్రాణాలను కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మరువకూడదన్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, ఓఎస్డీ టి.సాయి మనోహర్, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు మడిపెల్లి నాగరాజు, చెన్నూరి శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్లు ముప్పారపు కరుణాకర్, టి.రమేశ్, కాగితోజు శివప్రసాద్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు బోలెం రవి, సుధాకర్, కృష్ణారావు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- నారాయణరావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల ప్రారంభం

తరగతి గదిలో పిల్లల ప్రగతిని పరిశీలిస్తున్న పీవో రాహుల్

దుమ్ముగూడెం, అక్టోబర్ 26 : విద్యార్థులు చిన్నాటి నుంచి కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి పాత నారాయణరావుపేటలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పాఠశాలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్ కోసం గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరారని, దీంతో ఐటీడీఏ నుంచి రూ.4.50 లక్షల నిధులు మంజూరు చేయించి గ్రామంలో తాత్కాలిక పాఠశాలను ఏర్పాటు చేయించామని, దీనిని స్వయంగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే కోయభాష నేర్చుకునే విధంగా అవగాహన కల్పించాలని, భాషా, సంస్కృతి, ఆచార వ్యవహారాల గురించి తప్పనిసరిగా వివరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్సిళ్లు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం బొజ్జిగుప్పలో పాతకాలపు మట్టితో కట్టిన ఇంటిని పరిశీలించిన పీవో.. ఇలాంటి ఇంటి నిర్మాణం భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంలో చేపట్టాలని మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామికి సూచించారు. కాగా.. పాఠశాల ఏర్పాటు చేయించిన పీవోను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఈ హరీశ్, ఏఈ రవి, నారాయణరావుపేట పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, సర్వేశ్వర దొర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి అరెస్టును ఖండిస్తూ ఫ్లెక్సీలు

చింతకాలిలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చింతకాని, అక్టోబర్ 26 : ఖమ్మం జిల్లా చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల వ్యాప్తంగా పార్టీ గ్రామ, మండల శాఖల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో శనివారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప మాలధారణలో ఉన్న పుల్లయ్యను ఉగ్రవాదుల మాదిరిగా తీసుకెళ్లి అరెస్టు చేయడం తగదని, ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం సర్వసాధారణమని, నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిందంటూ ఫ్లెక్సీలపై రాశారు. నిరసనలో పాల్గొన్న వ్యక్తులు, ప్రతిపక్ష నాయకుల పేర్లను చేర్చి వారిని, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం తగదని, అయ్యప్ప మాలధారణలో ఉన్నా కనీస హిందూ ధర్మానికి విలువ ఇవ్వకుండా అరెస్టు చేసి తీసుకెళ్లడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

ఒకే రాష్ట్రం.. ఒకే పోలీస్ విధానం కావాలి

- ప్లకార్డులతో కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యుల ప్రదర్శన
- లక్ష్మీదేవిపల్లిలో ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన
- గంటపాటు నిలిచిపోయిన రాకపోకలు

లక్ష్మీదేవిపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న పోలీసుల భార్యలు, కుటుంబ సభ్యులు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 26 : 'ఒకే రాష్ట్రం.. ఒకే పోలీస్' విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం, చాతకొండకు చెందిన ఏఆర్ 6వ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు లక్ష్మీదేవిపల్లిలో శనివారం ప్లకార్డులతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై సుమారు 800 మంది బైఠాయించి ఆందోళనకు దిగారు. ఒకే నోటిఫికేషన్, ఒకే పరీక్ష, ఒకే ఈవెంట్, ఒకే యూనిఫాం అంటూ ప్లకార్డులు పట్టుకొని నినదించారు. దీంతో గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీస్ అధికారి ఓ కానిస్టేబుల్‌ను తోసివేయడంతో పోలీస్ కుటుంబాలు కొంత అసహనానికి లోనయ్యారు. సమస్యలపై ధర్నా చేస్తున్న కానిస్టేబుల్‌పై చేయి చేసుకోవడం సమంజసం కాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పదే పదే బదిలీలు చేపట్టకుండా ఐదేళ్లపాటు ఒకేచోట పోస్టింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా పోలీసు విధానాన్ని అనుసరించాలని వారు కోరారు.

- మధిరలో సబ్ సివిల్ కోర్టు ప్రారంభోత్సవంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

జిల్లా అదనపు కోర్టు ఏర్పాటును పరిశీలిస్తాం..

కోర్టు భవనాలకు భూమి పూజ చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

మధిర, అక్టోబర్ 26 : మధిరలో జిల్లా అదనపు కోర్టు మంజూరు అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ అన్నారు. మధిర పట్టణంలో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మున్సిఫ్ కోర్టుతోపాటు సబ్ సివిల్ కోర్టులు, రూ.39 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రికార్డ్స్ భవన నిర్మాణ పనులకు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి శ్రీసుధ, హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేశ్, కాజా శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జి.రాజగోపాల్‌తో కలిసి శనివారం భూమి పూజ చేశారు. భవన నిర్మాణ మ్యాపును న్యాయమూర్తులు పరిశీలించారు. అనంతరం రిక్రియేషన్ క్లబ్ కాంప్లెక్స్‌లో నూతనంగా మంజూరైన సబ్ సివిల్ కోర్టును ప్రారంభించారు.

ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల ప్రాంతంలో నూతన కోర్టు భవన నిర్మాణాలకు భూమి పూజ చేయడం గర్వంగా ఉందన్నారు. గతంలో ఇక్కడి ప్రజలు పడిన ఇబ్బందుల గురించి స్థానిక న్యాయవాదులు తన దృష్టికి తెచ్చారని, అలాగే బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా అదనపు కోర్టు మంజూరు చేయాలని కోరారన్నారు. దీంతో సబ్ సివిల్ కోర్టు మంజూరు చేశామన్నారు. తాత్కాలికంగా అద్దె భవనాల్లో కోర్టు నిర్వహణ కొనసాగుతుందన్నారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించి.. అగ్రిమెంట్ తేదీలోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మధిర సీనియర్ సివిల్ జడ్జి మీరాఖాసీం సాహెబ్, మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు బి.పుల్లారావు, కార్యదర్శి గోపాలం, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాంబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.